## అయ్యా..! అధికారులేరి?

- ప్రజావాణి రద్దయిన విషయం తెలియక పలువురి ఆరా


కలెక్టరేట్ ఇన్‌వర్డ్‌లో దరఖాస్తులు అందజేస్తున్న ప్రజలు

కలెక్టరేట్, ఏప్రిల్ 28: కొత్త రెవెన్యూ చట్టంపై జిల్లాలోని అవగాహన సదస్సుల నేపథ్యంలో ప్రజావాణి రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈమేరకు ఆదివారం పత్రికా ప్రకటన కూడా విడుదల చేశారు. ఈ విషయం తెలియని సుమారు వంద మందికి పైగా సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి అధికారుల కోసం ఆరా తీయడం కనిపించింది. ఈనెల 21న కూడా ప్రజావాణి రద్దు కాగా, ఈసారి కచ్చితంగా ఉంటుందని మండుటెండలో శ్రమపడుతూ కలెక్టరేట్‌కు వచ్చినట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవానికి ప్రజావాణి రద్దు చేస్తున్న సందర్భంలో శనివారం సాయంత్రమే పత్రికా ప్రకటన విడుదల చేస్తే, ఆదివారం దినపత్రికలో అచ్చు అయి, ఎక్కువ మందికి తెలిసే అవకాశముంటుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, భారీ సంఖ్యలో అర్జీదారులు కలెక్టరేట్‌కు వస్తున్న విషయం తెలుసుకున్న ఏవో గడ్డం సుధాకర్ ఫిర్యాదులు ఇన్‌వర్డ్ సెక్షన్‌లో ఇవ్వాలంటూ సూచించగా, తమ అర్జీలు అక్కడి సిబ్బందికి అందజేసి వెనుదిరిగారు.

# రూ.లక్షలు వ్యయం.. నిరుపయోగం


నగరంలోని సప్తగిరికాలనీలో నిరుపయోగంగా మారిన మినీ కూరగాయల మార్కెట్

- నగరంలో అక్కరకు రాని మినీ కూరగాయల మార్కెట్లు
- ఇంకా రోడ్లపైనే అమ్మకాలు
- నగరవాసులకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

కార్పొరేషన్, ఏప్రిల్ 28: నగరంలో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు నివారించడం.. నగరవాసులకు పరిశుభ్రమైన వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసే అవకాశం కల్పించే లక్ష్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మినీ కూరగాయల మార్కెట్లు నిరుపయోగంగా మారుతున్నాయి. నూతన మినీ కూరగాయల మార్కెట్లలో విక్రయాలు చేపట్టేలా వ్యాపారులకు అవగాహన కల్పించి ప్రోత్సహించడంలో నగరపాలక సంస్థ అధికారుల అలసత్వం వల్ల అవి అక్కరకు రాకుండా పోతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా ఓ వైపు రోడ్ల పక్కన ఇష్టారీతిగా సాగుతున్న కూరగాయల విక్రయాలతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారుతుండగా, వ్యర్థాలు పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

నగరంలోని జగిత్యాల మార్గంలో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల సమీపంలో అనేక మంది రోడ్ల పక్కనే కూరగాయల వ్యాపారాలు చేస్తున్నారు. దీని వల్ల తీవ్ర ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా మూల మలుపుల్లోనే అమ్మకాలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే, టెలిఫోన్ క్వార్టర్స్ రోడ్డులో కరోనా కాలంలో ప్రజల సౌకర్యం కోసం కూరగాయల అమ్మకాలకు అవకాశం ఇచ్చారు. దీంతో ప్రస్తుతం అక్కడ కూడా మార్కెట్ రోడ్డుపైనే సాగుతున్నది. ఈ రెండు ప్రాంతాల్లో రోడ్డు ట్రాఫిక్ సమస్యను నివారించేందుకు మినీ కూరగాయల మార్కెట్లు నిర్మించారు. ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల గోడను ఆనుకొని చైతన్యపురి రోడ్డులో మినీ కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేశారు. మరొకటి సప్తగిరి కాలనీ ప్రభుత్వ స్కూల్ గోడను ఆనుకొని నిర్మించారు.

### ఫలించని ప్రయత్నాలు

ఆయా మార్కెట్లను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు గతంలో పాలకులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. కొన్ని రోజుల పాటు వ్యాపారులను ఆయా మార్కెట్లలోకి తరలించే ప్రయత్నం చేశారు. కానీ అక్కడ అమ్మకాలు నాలుగు రోజులకే పరిమితమయ్యాయి. ముఖ్యంగా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు పకడ్బందీగా వ్యాపారులను ఈ మార్కెట్లకు తరలిస్తేనే ఉపయోగం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు పట్టింపు లేని ధోరణితో వ్యవహరించడం వల్లే ఏదైనా నాలుగు రోజులే అన్నట్లుగా కార్యక్రమం సాగుతున్నది. ముఖ్యంగా ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల రోడ్డులో దారిపొడవున అడ్డగోలుగా పండ్లు, కూరగాయల మార్కెట్ జోరుగా సాగుతున్నది. వీరందరిని మినీ మార్కెట్ వైపుగా తరలిస్తే ఆ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు తీరే అవకాశం ఉంది. కానీ ఈ దిశగా నగరపాలక సంస్థ అధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ ఉన్నతాధికారులు ఈ మినీ మార్కెట్లను వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## దరఖాస్తుల ఆహ్వానం

గంగాధర, ఏప్రిల్ 28 : గంగాధర మైనారిటీ పాఠశాలలో ఇంటర్మీడియట్ సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో, 5, 6, 7, 8వ తరగతిలో ప్రవేశాలకు అర్హులైన ముస్లిం, మైనారిటీ బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వాణిశ్రీ సోమవారం ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం సెల్ నంబర్లు 79950 57870/ 96033 13883/ 70757 93554/ 90301 53181 కు కాల్ చేసి సంప్రదించాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధిస్తున్న మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందాలని సూచించారు.

## విద్యా వాహిని ద్వారా బడిబాట

గంగాధర, ఏప్రిల్ 28 : మండలంలోని మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, నడిమిపల్లి గ్రామాల్లో విద్యా వాహిని వాహనం ద్వారా సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో అందుతున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలను గురించి తల్లిదండ్రులకు వివరించారు. వచ్చే నెల 1 నుంచి 10వరకు మల్లాపూర్ పాఠశాల ఆవరణలో ఉచిత యోగా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, అంజారెడ్డి, వెంకటరమణా రావు, మమత తదితరులు పాల్గొన్నారు.

# సర్వే పకడ్బందీగా చేపట్టాలి


మానకొండూర్: సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, ఏప్రిల్ 28: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సోమవారం మానకొండూర్ మండల కేంద్రంలో మహంకాళీ వీధిలో చేపట్టిన సర్వేను ఆమె పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శికి, ప్రత్యేక అధికారికి సర్వేపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఏఈ డోలి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రేవంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**'భూ భారతి'పై అవగాహన**

వీణవంక, ఏప్రిల్ 28: చల్లూరు రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్ వో ఆర్ చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా, కలెక్టర్ పమేలా సత్పతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులోని రెండంచెల అప్పీలు వ్యవస్థతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో నాలుగు రికార్డుల నిర్వహణ, అందరికీ కనబడేలా భూముల వివరాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సునీత, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, పీఏసీఎస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ గాజుల మేరీ, ఏవో గణేశ్, ఏఈవోలు రాకేశ్, అచ్యుత్, సంగీత, శ్రావణ్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## పురాణ గాథలను పిల్లలకు తెలియజేయాలి

- తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న మాధవానంద సరస్వతీ స్వామి

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 28 : పురాణ గాథలను వారసత్వ సంపదగా పిల్లలకు తెలియజేయకుంటే సనాతన సంస్కృతి ద్రోహులుగా మిగిలిపోతామని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. జిల్లా కేంద్రంలోని గణేశ శారద శంకరాలయంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా రుద్ర, శ్రీసూక్త పారాయణం, లక్ష పుష్పార్చన కార్యక్రమం స్వామి వారి పర్యవేక్షణలో మూడో రోజు కొనసాగింది. సుమారు వెయ్యి మందికి పైగా భక్తులు పాల్గొని శ్రీ మాత్రే నమః జపాన్ని కొనసాగించారు. భక్తుల భగవన్నామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో అఖిల బ్రాహ్మణ సేవా సంఘం కరీంనగర్ అధ్యక్షుడు కస్బా భూమేశ్వరరావు, శ్రీ గణేశ శారద శంకర ఆలయ కమిటీ అధ్యక్షుడు బండపెల్లి ఉపేందర్ శర్మ, ప్రధాన కార్యదర్శులు రామక విఠల్ శర్మ, పురం ప్రేమ్ చందర్ రావు, మూగు హరిశంకర్, మూగు నాగేశ్వర్ శర్మ, జీవీ రంగారావు, యెరబాటి శశికాంత్, గౌరవాధ్యక్షుడు నేదునూరి వామన్ రావు, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

శంకరపట్నం, ఏప్రిల్ 28: మండలంలోని తాడికల్ గ్రామంలో సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు. నిందితులను కేశవపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించి మంగళవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## తగ్గుతున్న పసుపు ధర

మెట్‌పల్లి, ఏప్రిల్ 28: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు కాడి సోమవారం క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 13,888, కనిష్ఠంగా రూ.8,111 పలికింది. గోళ క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 13,211, కనిష్ఠంగా 8,686, చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.11,599, కనిష్ఠంగా రూ.9,800 పలికింది. కాగా, ఈ నెల 22న పసుపు కాడి క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.16,001 పలకగా, 23న రూ. 15,001, 25న రూ. 14,021, 26న రూ.14,811, 28న రూ.13,888 ధరకు పడిపోయింది.

## ప్రయాణికుల భద్రత కోసం పోలీస్ అవుట్ పోస్టు

- కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం


బస్టాండ్‌లో అవుట్ పోస్టును ప్రారంభిస్తున్న సీపీ గౌష్ ఆలం

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 28: ప్రయాణికుల భద్రత కోసం జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. నగరంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, జిలా కేంద్రంలోని బస్టాండ్ నుంచి నిత్యం లక్ష మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు వెళ్తుంటారని, వారి భద్రత కోసం అవుట్‌పోస్టు ఏర్పాటు చేశామన్నారు. ఆవరణలోని 45 సీసీ కెమెరాలను కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. వన్ టౌన్ పోలీసుల పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. మరో 15 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను కోరామన్నారు. అవుట్ పోస్టు 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రయాణికులు లగేజీ, విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోకిరీలు, ఇతర భద్రత సమస్యలపై పోలీసుల అవుట్ పోస్టులోని సిబ్బంది సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటస్వామి, వన్ టౌన్ సీఐ కోటేశ్వర్, ఎస్ఐ రాజన్న, ఆర్టీసీ డిప్యూటీ ఆర్ భూపతి రెడ్డి, డీఎంలు శ్రీనివాస్, విజయమాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌వైవీ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్

కలెక్టరేట్, ఏప్రిల్ 28 : రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ సంబంధితాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో 57,763 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిని ఆన్‌లైన్ చేయడం పూర్తి కాగా, దరఖాస్తుల పరిశీలన కొనసాగుతున్నదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ కోటాలో నిర్దిష్ట లక్ష్యాన్ని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లకు ఇప్పటికే కేటాయించినట్లు వెల్లడించారు. లక్ష్యాన్ని చేరుకునే దిశగా అధికారులు లబ్దిదారులను ఎంపిక చేయాలని సూచించారు. బ్యాంకుల నుంచి ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖాధికారి పవన్‌కుమార్, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్జీఎఫ్ స్కేటింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారిణి


శ్రీహన్సిని అభినందిస్తున్న డీఈవో

కొత్తపల్లి, ఏప్రిల్ 28 : ఢిల్లీలో ఈనెల 30 నుంచి జరిగే జాతీయస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు జిల్లాకు చెందిన క్రీడాకారిణి శ్రీహన్సి ఎంపికైనట్లు కార్యదర్శి బి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బిర్లా పాఠశాలలో చదువుతున్న శ్రీ హన్సి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ స్కేటింగ్ పోటీల్లో పాల్గొని అండర్-11 విభాగంలో 1500 మీటర్లు రింక్, రోడ్‌రేస్ విభాగంలో బంగారు పతకాలను సాధించి జాతీయ పోటీలకు ఎంపికైందని పేర్కొన్నారు. క్రీడాకారిణిని జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్ధన్‌రావు, సెక్టోరియల్ అధికారి కర్ర అశోక్‌రెడ్డి తదితరులు అభినందించారు.

## జాతీయ సమావేశానికి హాజరైన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి


సాగర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 28: కేంద్ర ప్రభుత్వ జాతీయ యువజన, క్రీడా సర్వీసుల విభాగం ఆధ్వర్యంలో ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ జాతీయ సమావేశంలో స్థానిక వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రం నుంచి ముగ్గురు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులకు ఆహ్వానం అందగా, అందులో తమ కళాశాల ప్రోగ్రాం అధికారి ధనపురి సాగర్ ఉన్నారని చెప్పారు. ఇది ఎంతో తమకు కళాశాలకు గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం సాగర్‌ను కళాశాల కరస్పాండెంట్ వి. ఆగంరావు, ఏసీవో బి. సంపత్ కుమార్, ఏవో బి. శ్రవణ్ కుమార్, రామేశ్వర్ రావు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

## బాధిత మహిళలకు సత్వరమే 'సఖీ' సేవలు

కలెక్టరేట్ , ఏప్రిల్ 28 : మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ, సఖీ కేంద్రాన్ని ఆశ్రయించిన బాధిత మహిళలకు సత్వరమే సేవలు అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి తెలిపారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం, శక్తి సదన్, సఖీ కోఆర్డినేటర్లతో సప్తగిరి కాలనీలోని సఖీ కేంద్రంలో సోమవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాధిత మహిళలు సఖీ కేంద్రాన్ని ఆశ్రయించినప్పుడు వారికి ఉచిత న్యాయ, వైద్య, ఆశ్రయ, పోలీసు సేవలను సత్వరమే అందించాలన్నారు. అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పది మంది కంటే ఎక్కువగా మహిళలు పనిచేసే ప్రైవేటు, ప్రభుత్వ పని ప్రదేశాల్లో ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలకు స్వీయ అభివృద్ధి పథకాలు, ఉచిత శిక్షణలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సఖీ అడ్మిన్ లక్ష్మి, డి.హెచ్.ఈ.డబ్ల్యూ కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

## కఠినంగా శిక్షించాలి

చిగురుమామిడి, ఏప్రిల్ 28: రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం కోహెడలో 30గొర్రెల దొంగతనానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని చిగురుమామిడి మండల గొర్రెల పెంపకందారుల సహకారం సంఘం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం వారు మండల కేంద్రంలో మాట్లాడారు. గొర్రెల మంద వద్ద కాపలా ఉన్న గొర్రెల యజమాని కొడుకు (కానిస్టేబుల్) నవీన్‌పై దుండగులు దాడి చేయడం చాలా బాధాకరమన్నారు. వెంటనే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఇక్కడ సంఘం సభ్యులు పోతరవేని శివాంజనేయులు, పోతరవేని అనిల్, నూనె శ్రీనివాస్, ముదుగిరి రాజు, కర్రె సారయ్య, దయ్యాల మొగిలి, పోతార్ల రాజయ్య, నీల కొమురయ్య, దయ్యాల సునీల్ ఉన్నారు.

## 'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తుల పరిశీలన

కార్పొరేషన్, ఏప్రిల్ 28: నగరపాలక సంస్థ కళాభారతిలో కొనసాగుతున్న రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని సోమవారం నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా 15 వేల వరకు దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వారీగా పరిశీలిస్తున్నామని తెలిపారు. పథకానికి ఆన్‌లైన్ ద్వారానే కాకుండా నగరపాలక సంస్థలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వృద్ధురాలి బలవన్మరణం

తిమ్మాపూర్, ఏప్రిల్ 28: అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్న భర్తకు సేవలు చేస్తూ అనారోగ్యం బారిన పడిన ఓ వృద్ధురాలు మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన కెడిక నరసమ్మ(60) తన భర్తతో కలిసి గ్రామంలో నివసిస్తున్నారు. వారి కొడుకులు హైదరాబాద్‌లో ఉపాధి రీత్యా స్థిరపడ్డారు. ఇటీవల ఆమె భర్తకు గుండెపోటు వచ్చి అనారోగ్యంతో బాధపడుతుండగా, ఆయనకు సేవలు చేస్తున్నది. ఈ క్రమంలో ఆమె సైతం అనారోగ్యం బారిన పడగా.. కొడుకులు అందుబాటులో లేకపోవడం, తన భర్తను చూసుకునేందుకు ఆరోగ్యం సహకరించకపోవడంతో మనస్తాపం చెందింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కరీంనగర్‌కు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం ఎల్ఎండీలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం కావడంతో పోలీసులు సోషల్ మీడియాలో వైరల్ చేయగా నరసమ్మగా గుర్తించారు. ఆమె చిన్న కొడుకు శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివేక్ తెలిపారు.

# కాంగ్రెస్‌లో కుమ్ములాట

- ఏఐసీసీ కార్యదర్శి ముందే బహిర్గతం
- రసాభాసగా కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం


కరీంనగర్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగిన మంత్రి పొన్నం వర్గీయులు

కార్పొరేషన్, ఏప్రిల్ 28: కరీంనగర్ కాంగ్రెస్‌లో కుమ్ములాటలు మరోసారి బహిర్గతం అయ్యాయి. ఏఐసీసీ కార్యదర్శి ముందే ఇరువర్గాలు బాహాబాహికి దిగేందుకు యత్నించాయి. జిల్లాలో కొంతకాలంగా మంత్రి పొన్నం, కరీంనగర్ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మధ్య సాగుతున్న వర్గపోరు సోమవారం జరిగిన సమావేశంలో మరోసారి బయటపడింది. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్‌లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం రసాభాసగా మారింది. ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్ పెరుమాళ్లు ఎదురుగానే కాంగ్రెస్‌లోని విబేధాలు బయటపడ్డాయి. ఈ సమావేశంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ వర్గం, మంత్రి పొన్నం ప్రభాకర్ వర్గీయుల మధ్య వివాదంతో ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో పార్టీ సమావేశంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమావేశం ప్రారంభించిన అనంతరం సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాకు చెందిన ఓ నాయకుడు నియోజకవర్గానికి సంబంధించి ఏ ప్రతిపాదన తాము పంపించినా అడ్డుకున్నారని విమర్శించారు. గతంలోనూ పార్టీని భ్రష్టు పట్టించారని.. ఇప్పుడు కూడా అదే పని చేస్తుడడంతో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అధ్వానంగా మారిందని విమర్శించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు పడాల రాహుల్, చక్రధర్, శ్రీనివాస్ ఒక్కసారి వేదికపైకి దూసుకువచ్చి ఎవరి గురించి అంటున్నారంటూ నిలదీశారు. నిన్న కాక మొన్న పార్టీలోకి వచ్చి టిక్కెట్ పొంది అమ్ముడుపోయిన నువ్వు.. ఏళ్ల తరబడిగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని విమర్శించడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొన్నంను పరోక్షంగా విమర్శిస్తున్నారంటూ విమర్శించారు. దీంతో ఇరువర్గాల మధ్య కొద్దిసేపు తోపులాట సాగింది. వేదికపైన అగ్రనేత ముందే ఒకరినొకరు తోసుకున్నారు. ఇరువర్గాలు తీవ్రస్థాయిలో దూషణలు చేసుకున్నాయి. దీంతో సమావేశంలో గందరగోళ పరిస్థితి నెలకొన్నది. ఇరువర్గాల నాయకులు ఒకరిపైకి ఒకరు దూసుకొచ్చి బాహాబాహికి దిగినంత పనిచేశారు. దీంతో జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇతర నాయకులు ఇరువర్గాలను శాంతింపచేసే ప్రయత్నం చేశారు. కానీ ఎవరు వెనక్కి తగ్గకపోవడంతో సమావేశం అంతా రసాభాసగా మారింది. వివాదం ముదురుతుండడంతో పురుమల్ల శ్రీనివాస్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం సమావేశం కొనసాగింది. సమావేశం పూర్తయినా తర్వాత కూడా ఇరువర్గాల నాయకుల మధ్య మరోసారి వాగ్వాదం నెలకొన్నది. కాగా, పోలీసులు అక్కడి చేరుకొని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించేశారు.


లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మానకొండూర్, ఏప్రిల్ 28: నిరుపేదలకు వైద్యఖర్చుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మండలంలోని ఆయా గ్రామాల లబ్ధిదారులకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నందగిరి రవి, నాయకులు తాళ్లపెల్లి సంపత్‌గౌడ్, ఎండీ ఇర్ఫాన్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలి


వీణవంక పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

వీణవంక/ శంకరపట్నం, ఏప్రిల్ 28: ఆరోగ్య మహిళా హెల్త్ క్యాంపులు నిర్వహించి మహిళలందరికీ స్క్రీనింగ్ పూర్తి చేయాలని డా.వెంకటరమణ వైద్యులకు సూచించారు. సోమవారం వీణవంక, చల్లూరు, శంకరపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలలోని హాజరుపట్టిక, రికార్డులను పరిశీలించారు. ఇన్‌వార్డులో చికిత్స తీసుకుంటున్న పేషెంట్లతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ స్టోర్‌లో వేసవి కాలానికి సంబంధించిన మందుల నిల్వలు, కుక్కకాటు మందులను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.చందు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

### డీఎంహెచ్‌వోను కలిసిన ఫార్మసీ ఆఫీసర్

విద్యానగర్, ఏప్రిల్ 28: ప్రభుత్వ హాస్పిటల్‌లలో ఫార్మసిస్టులుగా కొనసాగుతున్న వారిని ఫార్మసీ ఆఫీసర్స్‌గా రాష్ట్ర ప్రభుత్వం మార్చిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చిలుక మురళీధర్ నేతృత్వంలో సోమవారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఫార్మసీ యూనియన్ ఆధ్వర్యంలో సీట్లు పంచుకొని సెలబ్రేషన్స్ జరుపుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సురేశ్ కళ్యాణ్, జిల్లా నాయకులు రాజమల్లు, రవి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. ఎనిమిది మందికి గాయాలు

సైదాపూర్, ఏప్రిల్ 28: మండలంలోని సోమారం గ్రామం వద్ద సోమవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన మైలారం శారద, చెంచల వనజ, బరిగల శారద, రెంటాల స్వరూప, కల్వల లలిత, కనక మమత, గాదెపాక సౌమ్య, రెంటాల వెన్నెల గ్రామం నుంచి హుజూరాబాద్ వెళ్తుండగా సోమారం గ్రామ సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలకు గాయాలు కాగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని హుజూరాబాద్ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా, పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, ఏప్రిల్ 28: లైన్, ఇతర మరమ్మతు పనులు చేపడుతున్నందున మంగళవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ లావణ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9నుంచి 11గంటల వరకు కెమిస్ట్ భవన్ ఏరియా, శివ టాకీస్, సెయింట్ అల్ఫోన్స్ ఏరియా, వేంకటేశ్వర స్వామి గుడి ప్రాంతాలు, ఉదయం 8.30నుంచి 10గంటల వరకు శక్తి టెంపుల్, బాలాజీ సూపర్ మార్కెట్ ఏరియా, సంతోష్ నగర్, భాగ్యనగర్, జ్యోతినగర్, గీతా భవన్ వెనుక ప్రాంతం, కార్పెంటర్ సొసైటీ, సంతోష్ మాతా హనుమాన్ గుడి ఏరియా, న్యూ లేబర్ అడ్డా, సాయిబాబా గుడి, విద్యానగర్, విజయ దుర్గ కాలనీ, హిందూ పురి కాలనీ, ఆర్టీసీ వర్క్ షాప్, ఎస్సారార్ డిగ్రీ కాలేజీ, చైతన్య పురి కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.